

'హై పెర్ఫార్మెన్స్ కంప్యూటింగ్‌తో పలు అవకాశాలు'

తాడేపల్లిగూడెం: హై పెర్ఫార్మెన్స్ కంప్యూటింగ్ నేర్చుకోవడం ద్వారా అనేక ఉపయోగాలు, అవకాశాలు ఉంటాయని జెఎన్‌టియు (కాకినాడ) కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగం సహాయ ఆచార్యులు మాస్టర్ ట్రైనర్ డాక్టర్ ఉషాదేవి తెలిపారు. అఖిల భారత సాంకేతిక విద్యా మండలి న్యూఢిల్లీ ఆధ్వర్యంలో హై పెర్ఫార్మెన్స్ కంప్యూటింగ్ అనే అంశంపై శనివారం శ్రీ వాసవి ఇంజినీరింగ్ కళాశాలలో అవగాహనా సదస్సు నిర్వహించారు. ముఖ్యఉపన్యాసకులుగా విచ్చేసిన ఉషాదేవి మాట్లాడుతూ రాబోయే కాలంలో హై పెర్ఫార్మెన్స్ కంప్యూటింగ్ ప్రభావం ఎక్కువగా ఉంటుందని, దాని సాయంతో ఎన్నో పనులను సునాయాసంగా చేయగలుగుతున్నారని తెలిపారు. ఇంట్రడక్షన్ టు హై పెర్ఫార్మెన్స్ కంప్యూటింగ్, హై పెర్ఫార్మెన్స్ కంప్యూటింగ్ ఆర్కిటెక్చర్ అండ్ సిస్టమ్స్, హై పెర్ఫార్మెన్స్ కంప్యూటింగ్ ఇన్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ అప్లికేషన్స్ తదితర వాటి గురించి వివరించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రత్నాకర్‌రావు, టెక్నికల్ డైరెక్టర్ చక్కా అప్పారావు ప్రసంగించారు. అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆయుధ డిపో అలజడి..!

- ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ వ్యాఖ్యలపై గిరిజనుల ఆగ్రహం
- నేవీ యుద్ధ సామగ్రి డిపోను గతంలోనే తీవ్రంగా వ్యతిరేకించిన గ్రామసభ
- మళ్లీ ఎంపీ ప్రకటనలపై జీలుగుమిల్లి మండలంలో తీవ్ర చర్చ
- గిరిజనులను బతకనీయరా అంటూ ఆవేదన
- పోలవరం నిర్వాసితులకు కాలనీలు నిర్మించి మళ్లీ గెంటివేతకు కుట్ర
- మరోసారి గ్రామసభ నిర్వహించి ఆమోదించుకునేందుకు కుతంత్రాలు?



గ్రామసభలో అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్న గిరిజనులు (ఫైల్‌ఫోటో)


గిరిజనులే టార్గెట్‌గా కూటమి ప్రభుత్వం కుట్రలు పన్నుతోంది. గత ప్రభుత్వ హయాంలోనే నేవీ యుద్ధ సామగ్రి డిపోను వ్యతిరేకిస్తూ గ్రామసభ తీర్మానం చేసినా మళ్లీ ఆయుధ డిపో నిర్మాణానికి పావులు కదుపుతోంది. గెలిపించిన ప్రజల అభిప్రాయాలకు వ్యతిరేకంగా ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ చేసిన వ్యాఖ్యలతో గిరిజనుల్లో తీవ్ర అలజడి నెలకొంది. ఇప్పటికే పోలవరం ప్రాజెక్టు పేరుతో కన్న తల్లిలాంటి ఊళ్లను వదిలి గిరిజన కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. ఇప్పుడు ఏజెన్సీ ప్రాంతమైన జీలుగుమిల్లి మండలంలో గ్రామాలను లేకుండా చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుతంత్రాలు పన్నుతున్నాయని గిరిజనులు మండిపడుతున్నారు. ఆయుధ డిపోపై ముందుకు సాగితే తాడోపేడో తేల్చుకుంటామంటూ గిరిజనులు హెచ్చరిస్తున్న పరిస్థితి.

ప్రజాశక్తి – ఏలూరు ప్రతినిధి

ఏజెన్సీ ప్రాంతం జీలుగుమిల్లి మండలం వంకవారిగూడెం పంచాయతీ పరిధిలో నేవీ యుద్ధ సామగ్రి డిపో (నేవీ ఎమ్యునేషన్ స్టోరేజీ) ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం కుట్రలు పన్నుతోంది. వైసిపి ప్రభుత్వ హయాంలోనే యుద్ధ సామగ్రి డిపో ఏర్పాటుకు సన్నాహాలు సాగాయి. ప్రజాభిప్రాయం సేకరించకుండా భూముల సర్వే సైతం నిర్వహించింది. ఏజెన్సీ ప్రాంతాలకు రక్షణ కవచంలా ఉన్న పీసా చట్టాన్ని తుంగలో తొక్కి 2023 సెప్టెంబర్‌లోనే అప్పటి వైసిపి ప్రభుత్వం, కేంద్రంలోని మోడీ సర్కార్ ముందుకు సాగాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కుట్రలను గ్రహించిన గిరిజనులు ఆయుధ డిపోను తీవ్రంగా వ్యతిరేకించారు. రోడ్డెక్కి ఆందోళనలు, ధర్నాలు నిర్వహించారు. ఏజెన్సీ ప్రాంతంలో ఏదైనా చేయాలంటే గ్రామసభ నిర్వహించి, తీర్మానాలు చేస్తే తప్ప ముందుకు సాగడానికి వీలుండదు. అటువంటి ప్రక్రియ చేయకుండానే యుద్ధ సామగ్రి డిపో ఏర్పాటుకు సంబంధించిన భూసేకరణ వివరాలు నేవీ ఆర్మమెంట్ డిపో విశాఖపట్నం చీఫ్ జనరల్ మేనేజర్ కోరుతున్నట్లు జిల్లా కలెక్టర్‌కు, జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒకు, జీలుగుమిల్లి తహశీల్దార్‌కు ఆదేశాలు సైతం జారీ అయ్యాయి. జీలుగుమిల్లి మండలంలోని వంకవారిగూడెం, దాట్లవారిగూడెం, మడకంవారిగూడెం, రమణక్కపేట, కోత సీమలవారిగూడెం గ్రామాల్లో యుద్ధ సామగ్రి డిపో ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రచించారు. మొత్తం 1165.55 ఎకరాలు అవసరమున్నట్లు నేవీ అధికారుల నుంచి వచ్చిన లేఖలో పేర్కొన్నారు. దీనిలో రూ.27.19 కోట్లు విలువ చేసే ప్రభుత్వ భూమి, భూమికి భూమి కింద రూ.671.60 కోట్లు, మేజర్లు అయిన గిరిజన యువతకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్‌కు వచ్చిన ఉత్తర్వుల గురించి అక్కడి ప్రజలకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా చేసిన పరిస్థితి అప్పట్లో సాగింది.



భూసేకరణకు ఎవరూ గ్రామంలోకి రావొద్దని వంకవారిగూడెం గ్రామస్తులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ



ఆయుధ డిపో ఏర్పాటును వ్యతిరేకిస్తూ గ్రామసభ తీర్మానం

అప్పట్లోనే రోడ్డెక్కి గిరిజనుల పోరాటం..

నేవీ యుద్ధ సామగ్రి డిపో ఏర్పాటుపై ప్రభుత్వ కుట్రలు గ్రహించిన గిరిజనుల్లో అప్పట్లో పెద్దఎత్తున రోడ్డెక్కి ఆందోళనకు దిగారు. వంకవారిగూడెం పంచాయతీలో ఏర్పాటు చేసిన గ్రామసభను అంతా తీవ్రంగా వ్యతిరేకించారు. మా గ్రామాల్లోకి వచ్చి ఎటువంటి సర్వేలు నిర్వహించొద్దంటూ హెచ్చరిస్తూ ఫ్లెక్సీలు సైతం ఏర్పాటు చేశారు. దీంతో ప్రభుత్వం వెనక్కి తగ్గింది. కూటమి ప్రభుత్వం మళ్లీ కుట్రలకు దిగుతోంది. ఏలూరు జిల్లా పరిధిలోని పోలవరం, కుక్కునూరు, వేలేరుపాడు, జీలుగుమిల్లి, బుట్టాయగూడెం మొత్తం ఐదు మండలాల్లో ఏజెన్సీ ప్రాంతం విస్తరించి ఉంది. పోలవరం ప్రాజెక్టు దెబ్బకు కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని దాదాపు 105 గ్రామాలు కనుమరుగుకానున్నాయి. పోలవరం మండలంలోని 29 గ్రామాలను దూరంగా తరిమేశారు. ఇప్పుడు జీలుగుమిల్లి మండలంపై పడ్డారు. గిరిజనులు స్వేచ్ఛగా బతికే అవకాశం లేకుండా చేస్తున్నారు. మైదాన ప్రాంతంలో నేవీ ఆయుధ డిపో ఏర్పాటు చేస్తే భూమి కొనుగోలుకు ఎక్కువ ఖర్చవుతుందని ఏజెన్సీ ప్రాంతంపై కన్నేసినట్లు తెలుస్తోంది. ఇప్పుడు ఎక్కడైతే ఆయుధ డిపో ఏర్పాటు చేయాలని చూస్తున్నారో వంకవారిగూడెం పంచాయతీ పరిధిలో పోలవరం నిర్వాసితులకు కాలనీలు కట్టారు. పోలవరం మండలం వాడపల్లి గ్రామానికి చెందిన దాదాపు 70 కుటుంబాలను ఇక్కడ ఇళ్లు నిర్మించి తరలించారు. గిరిజనులకు భూమికి భూమి సైతం వంకవారిగూడెం పంచాయతీలో ఇచ్చారు. మళ్లీ ఇక్కడ నుంచి కూడా తరిమేయాలని చూడటం అత్యంత దారుణమని చెప్పొచ్చు. ఇప్పటికే కన్నతల్లి వంటి ఊళ్లను వదిలేసిన గిరిజనుల పట్ల ఎందుకింత కక్షగట్టారనే ప్రశ్నలకు ప్రజాప్రతినిధులు సమాధానం చెప్పాల్సి ఉంది. జీలుగుమిల్లి మండలంలో పోలవరం నిర్వాసితులకు సంబంధించి 17 కాలనీలు ఏర్పాటు చేస్తున్నారు. ఇక్కడకు వేలాది కుటుంబాలు చేరుతున్నాయి. నేవీ ఆయుధ డిపో ఏర్పాటైతే విపరీతమైన ఆంక్షలు పెరిగి జీలుగుమిల్లి మండలంలో ఉన్న 12 పంచాయతీల పరిధిలోని 33 గ్రామాల ప్రజల పరిస్థితి అగమ్యగోచరంగా మారనుంది. ఏజెన్సీలో నేవీ యుద్ధ సామగ్రి డిపో ఏర్పాటు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, తమ ఓట్లతో గెలిచిన ఎంపీ, ఎంఎల్‌ఎ అందుకు కృషి చేయాలని గిరిజనులు కోరుతున్నారు. అందుకు విరుద్ధంగా ముందుకు సాగితే పోరాటం తప్పదని హెచ్చరిస్తున్నారు.

29న గ్రామసభ నిర్వహణకు ఉత్తర్వులు

వంకావారిగూడెం పంచాయతీ పరిధిలో నేవీ ఆయుధ సామగ్రి డిపోకు సంబంధించి భూసేకరణ నిమిత్తం అభిప్రాయ సేకరణ కోసం ఈ నెల 29వ తేదీ మంగళవారం పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామసభ ఏర్పాటు చేస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి శనివారం నోటీసులు జారీ చేశారు. ఉదయం 11 గంటలకు ఈ కార్యక్రమం తహశీల్దార్ అధ్యక్షతన ప్రారంభమవుతుందని తెలిపారు.

ధాన్యం కొనుగోలుకు సిద్ధం కావాలి

జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి – తణుకు రూరల్

ధాన్యం కొనుగోలుకు రైతు సేవా కేంద్రాలు పూర్తి మౌలిక వసతులు, సిబ్బందితో సిద్ధంగా ఉండాలని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. మండలంలోని తేతలిలో రైతు సేవా కేంద్రాన్ని ఆయన శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అధికారులకు, సిబ్బందికి పలు సూచనలిచ్చారు. వరి తేమ శాతం చూసే టెక్నికల్ మిషన్ ద్వారా ధాన్యం వేసి తేమ శాతాన్ని పరిశీలించారు. రిజిస్టర్లను, టెక్నికల్ పరికరాలను పరిశీలించారు. దగ్గరలో ఉన్న వరి పొలాలను పరిశీలించి, వరి కోతకు ఎన్ని రోజుల్లో రావచ్చునని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఎటువంటి ఇబ్బందులూ తలెత్తకుండా చూడాలన్నారు. రైతుకు కనీస మద్దతు ధరను కల్పించేందుకు పాటుపడాలని ఆదేశించారు. రైతు సేవా కేంద్రాల్లో సరిపడినన్ని గోనె సంచులను సిద్ధం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ వై.భవానీశంకరి, తహశీల్దారు డివిఎస్ఎస్.అశోక్‌వర్మ, వ్యవసాయ సహాయ సంచాలకులు రమేష్, మండల వ్యవసాయ శాఖ అధికారి కుసుమ పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం: జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి పెదతాడేపల్లి రైతు సేవా కేంద్రం వద్ద అధికారులతో ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో మొట్టమొదటి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పెదతాడేపల్లిలో ఈ నెల 29న ప్రారంభించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు మురళీకృష్ణ, తహశీల్దార్ ఎం.సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

బాలల హక్కులను కాపాడాలి

భీమవరం టౌన్: చిన్నారుల హక్కుల గురించి తెలియజెప్పడంలో ప్రతి ఒక్కరూ కీలకపాత్ర పోషించాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి పురుషోత్తమకుమార్ చింతలపూడి తెలిపారు. శనివారం డిఎన్‌ఆర్ కాలేజీ సమావేశం హాలులో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, భీమవరం మండల సర్వీసెస్ ఆధ్వర్యంలో ది రైట్ ఆఫ్ ది చిల్డ్రన్ ఫర్ ఇంప్లిమెంటేషన్ ఆఫ్ నల్సా అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథి పురుషోత్తమకుమార్ మాట్లాడుతూ బాలల హక్కులను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ బాలలకు మంచి వాతావరణం కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ఎస్‌పి అద్నాన్ నయీం అస్మి మాట్లాడుతూ హెూటల్స్, ఇటుక బట్టీలు, గృహాలలో బాల కార్మికులుగా ఎవరూ ఉండకూడదన్నారు. కార్యక్రమంలో డిఎల్ఎస్ఎ సెక్రటరీ కం సివిల్ జడ్జి కె.రత్న ప్రసాద్, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వై.యోహాన్ న్యూటన్, ఇంకా సోమశేఖర్, డి.సత్యవతి, విజయదుర్గ పాల్గొన్నారు.

'ఫెర్రీ బకాయి 3 వాయిదాల్లో చెల్లిస్తా'

ప్రజాశక్తి – నరసాపురం

నరసాపురంలోని మాధవవాయిపాలెం ఫెర్రీరేవు పాట నిమిత్తం ప్రభుత్వానికి బకాయి పడ్డ పూర్వపు పాటదారుడు బకాయి పడ్డ రూ.55 లక్షలను మూడు వాయిదాల్లో పూర్తిగా చెల్లిస్తామని పాత పాటదారుడు రెడ్డప్ప ధవేజీ జాయింట్ యాక్షన్ కమిటీకి తెలిపారు. శనివారం ఎంపిడిఒ కార్యాలయంలో జెఎసి సమావేశమై పెండింగ్ బకాయిపై చర్చించారు. ఈ సమాచారంతో ధవేజీ ఆ సమావేశానికి హాజరయ్యారు. తాను బకాయి పడ్డమొత్తాన్ని మూడు వాయిదాల్లో చెల్లించే విధంగా వెసులుబాటు ఇవ్వాలని కోరారు. దానికి సంబంధించి మూడు పోస్ట్ పెయిడ్ చెక్కులను కమిటీకి అందించారు. బకాయి తీరిన తరువాత భవిష్యత్లో జరిగే రేవు పాటలో కూడా పాల్గొనే అవకాశం కల్పించాలని, తన పంటు ప్రభుత్వ అధీనంలో ఉన్నందున దానికి సంబంధించిన రోజువారీ అద్దెను తనకు ఇవ్వాలని కోరారు. బకాయి తీరిన తరువాత ఆ మొత్తాన్ని సెటిల్ చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై జెఎసి సానుకూలంగా స్పందించింది. ధవేజీ లిఖితపూర్వకంగా ఇచ్చిన వినతి జిల్లా అధికారులకు తెలిపి దానికి అనుగుణంగా వ్యవహరిస్తామని ఎంపిడిఒ జివిఎస్.రామకృష్ణంరాజు చెప్పారు. ఈ సమావేశంలో ఎంపిపి సోని, సూపరింటెండెంట్ వీరభద్రరావు, సిబ్బంది సురేష్ పాల్గొన్నారు. గతంలో నరసాపురం పూర్వపు ఎంపిడిఒ ఎం.వెంకటరమణారావు ఆత్మహత్యకు సంబంధించి ఈ పాటదారుని ఒత్తిళ్ల వల్లేనని ఆరోపణలు విన్పించిన సంగతి తెలిసిందే.

ఉండి నియోజకవర్గంలో రోబో టీచర్లు

ఎంఎల్‌ఎ రఘురామకృష్ణంరాజు

ప్రజాశక్తి – ఉండి

నియోజకవర్గంలో టీచర్ల కొరత ఉన్న చోట రోబోలతో భర్తీ చేయనున్నట్లు శాసనసభ్యులు కనుమూరి రఘురామ కృష్ణంరాజు అన్నారు. శనివారం సాయంత్రం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఇందుకూరి శ్రీహరి నారాయణరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంఎల్‌ఎ రఘురామకృష్ణంరాజు మాట్లాడారు. విద్యార్థులకు పూర్తిస్థాయిలో విద్యనందించేందుకు టీచర్ల కొరత ఉన్నచోట రోబోలతో భర్తీ చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. తొలుత ఉండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పాలకోడేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రోబో టీచర్లను ప్రవేశపెట్టి తర్వాత మిగిలిన చోట్ల రోబోలను ప్రారంభిస్తామన్నారు. ఇసుక కొరత వల్ల నిర్మాణాలు నిలిచిపోతున్నాయని అధికారులు ఎంఎల్‌ఎ దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఎంఎల్‌ఎ ఉచిత ఇసుక అని ప్రభుత్వం ప్రచారాలు చేస్తుంటే కనీసం జాతీయ గ్రామీణ ఉపాధి పనులకు కూడా ఇసుక తీసుకురాలేని పరిస్థితుల్లో ఉన్నామని, వెంటనే ఇసుక అందుబాటులోకి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకోవాల్సిందిగా తహశీల్దార్ కావడి నాగార్జునకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం ఎంఎల్‌ఎ గెలిచిన వెంటనే పంట, మురుగు కాలువలు ప్రక్షాళన చేసి రైతుల కష్టాలను తీర్చేందుకు కృషి చేసిన రఘు రామకృష్ణంరాజును అధికారులు, ప్రజాప్రతినిధులు ఘనంగా సత్కరించారు.



ఎంఎల్‌ఎను సత్కరిస్తున్న నేతలు, అధికారులు

అమ్మ విలువ వెలకట్టలేనిది

'మా అమ్మ సత్యవతి' షార్ట్ ఫిల్మ్ ఆవిష్కరణ

ప్రజాశక్తి – పాలకొల్లు

అమ్మ విలువ వెలకట్టలేనిదని మాజీ ఎంఎల్‌ఎ బాబ్జి చెప్పారు. పాలకొల్లుకు చెందిన విశ్వమానవ వేదిక వ్యవస్థాపకులు మల్లుల సురేష్ సతీమణి డాక్టర్ జ్ఞానేశ్వరి నటించిన 'మా అమ్మ సత్యవతి' షార్ట్ ఫిల్మ్‌ను శనివారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ విలువలు నశించిపోతున్న సమాజంలో ఆమ్మ విలువను షార్ట్ ఫిల్మ్‌లో అద్భుతంగా చూపించారని చెప్పారు. దీనిలో జ్ఞానేశ్వరితో పాటు వారి కుమారుడు జీవం పోశారని చెప్పారు. నేడు ఎక్కువ మంది విదేశాలకు వెళుతూ తల్లిదండ్రులను వృద్ధాశ్రమంలో వేస్తున్నారని చెప్పారు. అలాగే జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత వంగా నరసింహారావు మాట్లాడారు.

బెల్టు షాపులకు వేలం పాట!

ప్రజాశక్తి – నరసాపురం

నరసాపురం నియోజకవర్గ తీర ప్రాంతంలో గ్రామాల్లో బెల్ట్ షాపులకు డిమాండ్ ఏర్పడింది. గ్రామంలో బెల్ట్ షాపులు ఏర్పాటు చేసుకునేందుకు పోటీ ఎక్కువగా ఉండడంతో వివాదాలు తలెత్తకుండా ఉండేందుకు మద్యం షాప్ యజమానులు ప్రణాళిక సిద్ధం చేశారు. దానికి అనుగుణంగా గ్రామంలో వేలంపాట నిర్వహిస్తున్నారు. శనివారం మండలంలోని ఓ తీర ప్రాంతం గ్రామంలో గ్రామ పెద్దలు, మద్యం వ్యాపారులు ఒప్పందం ప్రకారం వేలం పాట నిర్వహించారు. ఈ పాటలో నలుగురు మధ్య పోటీ ఏర్పడగా గ్రామానికి చెందిన ఓ వ్యక్తి బెల్ట్ షాప్ రూ.2.20 లక్షలకు దక్కించుకున్నట్లు సమాచారం. గ్రామ పెద్దలు కట్టుబడి ప్రకారం ఇతరులు ఎవరూ ఆ గ్రామంలో బెల్ట్ షాప్ నిర్వహించకూడదని నిబంధన పెట్టారు. వేలంపాట ద్వారా వచ్చిన సొమ్మును గ్రామాభివృద్ధికి ఉపయోగిస్తారని పెద్దలు తెలుపుతున్నారు. నియోజకవర్గ పరిధిలోని అన్ని షాపులకు ఈ రకంగా వేలంపాట నిర్వహించాలని సిండికేట్ వ్యాపారాలు నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం.

విద్యారంగ సమస్యల పరిష్కారానికి నన్ను గెలిపించండి

టీచర్స్ ఎంఎల్‌సి అభ్యర్థి బి.గోపీమూర్తి

ప్రజాశక్తి – తాడేపల్లిగూడెం

విద్యారంగం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి, ప్రభుత్వ, ప్రయివేట్, ఎయిడెడ్, కాంట్రాక్టు అధ్యాపకుల హక్కులకు అండగా, కీర్తిశేషులు షేక్ సాబ్జీ ఆశయ సాధనకు వారసునిగా ఉభయగోదావరి జిల్లాల టీచర్స్ ఎంఎల్‌సి ఉప ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థిగా బరిలోకి దిగుతున్న తనకు ఉపాధ్యాయులు, అధ్యాపకులు అంతా సహకరించి గెలిపించాలని బొర్రా గోపీమూర్తి కోరారు. శనివారం ఆయన తాడేపల్లిగూడెం పట్టణం, రూరల్ మండలాల్లోని హైస్కూళ్లలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఏర్పాట చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యలపై నిరంతర పోరాటం, రాజీలేని ఉద్యమాలతో తాను పెరిగానన్నారు. షేక్ సాబ్జీ మరణానంతరం ఆయన వారసుడిగా పిడిఎఫ్ అభ్యర్థిగా బరిలోకి దిగుతున్న తనను గెలిపించాలని ఆయన ఉపాధ్యాయులను కోరారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పిఎస్.విజయరామరాజు, జిల్లా అసోసియేట్ అధ్యక్షురాలు కె.శ్రీదేవి, జిల్లా కార్యదర్శి కె.శివప్రసాద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బొర్రా గోపీమూర్తి

ఆచంట: ఉపాధ్యాయ, అధ్యాపక, కార్మిక, ఉద్యోగ, పేద ప్రజల సమస్యల పరిష్కారానికి త్వరలో జరగనున్న టీచర్స్ ఎంఎల్‌సి పిడిఎఫ్ అభ్యర్థి బొర్రా గోపీమూర్తిని ఉపాధ్యాయులంతా ప్రథమ ప్రాధాన్యతా ఓటుతో, అఖండ మెజారిటీతో గెలిపించాలని యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కేతా వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికల సమన్వయ సన్నాహక సమావేశం డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎస్‌విఎన్.శర్మ అధ్యక్షతన జరిగింది. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ శాసనమండలిలో పేదల గొంతు విన్పించడమే కాకుండా ఆ సమస్యలు పరిష్కారమయ్యేంత వరకూ పోరాట పటిమతో ఎలుగెత్తే వ్యక్తి గోపీమూర్తి అని అన్నారు. అటువంటి ప్రజా ఉద్యమాల అనుభవం కలిగిన గోపీమూర్తిని ఉపాధ్యాయులంతా ఐక్యంగా తమ ప్రథమ ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో నేతలు అరుణ్ కుమార్, వి.ఉషారాణి, కేతా నాగాంజనేయులు, తోటపల్లి సత్యనారాయణ, తలుపూరి బుల్లబ్బాయి, బండి రంగారావు, పి.మోహనరావు, తమరాపు దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

సెంట్రల్ జోన్ బాస్కెట్‌బాల్, నెట్‌బాల్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి – భీమవరం టౌన్

రెండు రోజులపాటు భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో జరిగే జెఎన్‌టియుకె సెంట్రల్ జోన్ అంతర్ కళాశాలల బాస్కెట్‌బాల్, నెట్‌బాల్ పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. పోటీలను కళాశాల ఉపాధ్యక్షులు ఎస్‌వి.రంగరాజు, ప్రిన్సిపల్ డాక్టర్ కెవి.మురళీకృష్ణంరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడల కమిటీ కన్వీనర్ డాక్టర్ పి.సత్యనారాయణరాజు మాట్లాడుతూ జెఎన్‌టియుకె పరిధిలో బాస్కెట్‌బాల్‌కు 21 టీమ్స్, నెట్‌బాల్‌కు పది టీమ్స్ హాజరయ్యారు. పోటీలకు పరిశీలకులుగా విజయవాడ లైలా కళాశాల నుండి రాజేష్, ఒంగోలు డిస్ట్రిక్ట్ సెలక్షన్ కమిటీ అథారిటీ నుండి శ్రీనివాసరావు హాజరయ్యారన్నారు. నెట్‌బాల్‌కు వైజాగ్ డిస్ట్రిక్ట్ అసోసియేషన్‌కు చెందిన బి.వెంకటేశ్వర్లు, పశ్చిమగోదావరి జిల్లా నెట్‌బాల్ అసోసియేషన్ సెక్రటరీ డి.ఖాన్ విచ్చేశారు. ఆదివారం ఉదయం మహిళా బాస్కెట్‌బాల్, నెట్‌బాల్ పోటీలు ప్రారంభమవుతాయి. కార్యక్రమంలో కళాశాల అసిస్టెంట్ ఫిజికల్ డైరెక్టర్ సిహెచ్.హరిమోహన్, జి.సారిక, అవినాష్ పాల్గొన్నారు.

భారతీయ విద్యా భవన్ సేవలు ఎనలేనివి

త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి

ప్రజాశక్తి – భీమవరం

విద్యారంగంలో కులమతాలకు అతీతంగా 40 ఏళ్ల నుంచి భారతీయ విద్యా భవన్స్ అందిస్తున్న సేవలు ఎనలేనివని త్రిపుర రాష్ట్ర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి అన్నారు. చదువు అంటే అక్షరాలు నేర్చుకోవడమే కాదని, అన్ని అంశాలనూ నేర్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. శనివారం జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన భారతీయ విద్యాభవన్స్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తొలుత విద్యార్థులు బ్యాండ్‌తో స్వాగతం పలకగా, ఎన్‌సిసి క్యాడెట్లు మార్చ్‌ఫాస్ట్‌తో గవర్నర్‌ను వేదిక వద్దకు తోడ్కొని వచ్చారు. అనంతరం గవర్నర్ బాల సరస్వతి విగ్రహానికి పూలమాలవేసి, జ్యోతి వెలిగించారు. ఈ సందర్భంగా ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ భారతీయ విద్యా భవన్ రాష్ట్రంలో, అంతర్జాతీయ స్థాయిలో ప్రఖ్యాతి గడించిందన్నారు. భీమవరంలో విద్యాసంస్థను నడిపిస్తున్న విశ్వనాథరాజు, వారి అధ్యాపక బృందాన్ని గవర్నర్ అభినందించారు. విద్యను వ్యాపారంగా కాకుండా ఒక ట్రస్ట్ రూపంలో నడుపుతూ ఆదర్శంగా నిలుస్తుందన్నారు. కంప్యూటర్ నేర్చుకున్నంత మాత్రాన ప్రయోజనం ఉండదని, ప్రతి విషయాన్నీ క్షేత్రస్థాయిలో వాస్తవంగా తెలుసుకుని అప్పుడు కంప్యూటర్ అప్లికేషన్ చేయడం మంచి ఫలితాన్ని ఇస్తుందన్నారు. మంచిగా చదువుకోవాలని, క్రీడల్లో పాల్గొనాలని, తోటి వారికి సహాయం చేయాలని సూచించారు. తొలుత భారతీయ విద్యాభవన్స్ విద్యార్థులచే నిర్వహించిన నృత్య ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. అనంతరం వివిధ విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి మెడల్స్ సాధించిన విద్యార్థులకు అవార్డులను గవర్నర్ చేతుల మీదుగా అందజేశారు. అనంతరం గవర్నర్‌ను భారతీయ విద్యా భవన్స్ యాజమాన్యం సన్మానించింది. కార్యక్రమంలో ఉంగుటూరు ఎంఎల్‌ఎ పత్సమట్ల ధర్మరాజు, భారతీయ విద్యాభవన్స్ ఛైర్మన్ విశ్వనాథ్‌రాజు, అచ్యుతరామరాజు, శ్రీనివాసరాజు, రామరాజు, ఆర్‌డిఒ ప్రవీణ్ కుమార్‌రెడ్డి, తహశీల్దార్ రావి రాంబాబు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న త్రిపుర రాష్ట్ర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి

తొలుత జిల్లా పర్యటనకు విచ్చేసిన త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డికి ఘనస్వాగతం లభించింది. జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మి, భీమవరం ఆర్‌డిఒ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి పుష్పగుచ్ఛాలను అందజేసి స్వాగతం పలికారు.

పాలకోడేరు: అర్హతున్న ప్రతిఒక్కరూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వినియోగించుకుని ఆర్థికపురోగతి సాధించాలని త్రిపుర గవర్నర్ ఎన్,ఇంద్రసేనారెడ్డి సూచించారు. శనివారం ఆయన విస్సాకోడేరులో పర్యటించి బిజెపి నేత పురిఘళ్ల రఘురామ్ నివాసానికి విచ్చేశారు. పురిఘళ్ల రాధాకష్ణమూర్తి ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సేవా కార్యక్రమంలో గవర్నర్ పాల్గొన్నారు. మహిళలకు కుట్టుమిషన్లను గవర్నర్ చేతుల మీదగా పంపిణీ చేశారు. అనంతరం ఆయనకు స్థానికులు రఘురామ్ ఆధ్వర్యంలో పౌరసత్కారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో విస్సాకోడేరు, గొరగనమూడి సర్పంచులు బొల్లా శ్రీనివాస్, గొట్టుముక్కల శివాజీరాజు, స్థానిక నాయకులు ఆరేపల్లి నాగరాజు పాల్గొన్నారు.

యువత ఉత్సాహంగా క్రీడల్లో పాల్గొనాలి

ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ

ప్రజాశక్తి – తణుకు

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో రాబోయే ఐదు సంవత్సరాల్లో 20 లక్షల ఉద్యోగావకాశాలు యువతకు కల్పిస్తారని తణుకు ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. ప్రభుత్వం, యువజన సర్వీసుల శాఖ, సెట్‌వెల్, జిల్లా వారి ఆధ్వర్యంలో ఎస్‌కెఎస్‌డి మహిళా కళాశాల డిగ్రీ, పీజీ (అటానమస్) కళాశాలలో జిల్లాస్థాయి యువజనోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ నేటి యువత చదువుతో పాటు క్రీడలు, కల్చరల్ విషయాల్లో కూడా ఉత్సాహంగా పాల్గొనాలన్నారు. వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకుని జీవితంలో పైకి రావాలని యువతకు సూచించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వాలు యువతకు అందించే అవకాశాలను ఉపయోగించుకుని జీవితంలో ఉన్నత స్థాయిలో ఉండాలన్నారు. ఈ పోటీల్లో తాడేపల్లిగూడెం, గణపవరం, పాలకొల్లు, భీమవరం కళాశాలల నుంచి విద్యార్థులు హాజరయ్యారు. కార్యక్రమంలో తాడేపల్లిగూడెం ఆర్‌డిఒ వై.భవానీశంకరీ, సిఇఒ సెట్‌వెల్ ఏలూరు కెఎస్.ప్రభాకరరావు, కళాశాల ప్రిన్సిపల్ కెప్టెన్ యుఎల్ సుందరీబాయి, జాయింట్ సెక్రటరీ చిట్టూరి వెంకటకృష్ణారావు, వివేకానంద గ్లోబల్ స్కూల్ సెక్రటరీ చిట్టూరి రీనాసాయి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ

ఆర్‌టిసి బస్సు ప్రయాణం సౌకర్యవంతం

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ఆర్‌టిసి బస్సుల్లో ప్రయాణం ప్రయాణికులకు ఎంతో సౌకర్యంగా ఉంటుందని ఎంఎల్‌ఎ పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. శనివారం ఉదయం 10.30 గంటలకు భీమవరం బస్టాండ్ నుంచి కొత్త ఎక్స్‌ప్రెస్‌ను ఎంఎల్‌ఎ అంజిబాబు పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భీమవరం నుంచి అమలాపురం వెళ్లే ప్రయాణికులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ పివిఎన్‌విఎం.సత్యనారాయణమూర్తి, అసిస్టెంట్ మేనేజర్ ఎంఎస్‌ఎ, ఆఫీస్ సిబ్బంది, ట్రాఫిక్ సూపర్‌వైజర్లు, యూనియన్ ప్రతినిధులు, ప్రయాణికులు పాల్గొన్నారు.

ఉచిత గ్యాస్‌పై విస్తృత ప్రచారం

ప్రజాశక్తి - ఆచంట

టిడిపి కూటమి ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు మహిళల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈ నెల 31న దీపావళి కానుకగా ఉచిత గ్యాస్ అమలుపై ఆచంటలో విస్తృత ప్రచార నిర్వహించారు. ఈ ప్రచారంలో ఆచంట చినపేటకు చెందిన ఆంధ్ర లక్ష్మణరావు విచిత్ర వేషధారణలో పసుపు సైకిల్‌పై టిడిపి జెండాలు కట్టి గ్యాస్ సిలిండర్‌ను పెట్టి ఊరు విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ ఉచిత గ్యాస్ పథకాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభిస్తారని తెలిపారు. ఈ నెల 29 నుంచి ఈ పథకం కింద బుకింగ్ ప్రారంభిస్తారని తెలిపారు. గ్యాస్ బుక్ చేయగానే సంబంధిత లబ్ధిదారుల ఫోన్ నంబర్‌కు ఎస్ఎంఎస్ వస్తుందన్నారు. 48 గంటల్లో గ్యాస్ సిలిండర్ డెలివరీ చేస్తారని, డెలివరీ అయిన 48 గంటల్లో లబ్ధిదారులకు బ్యాంక్ ఖాతాకు డిబిటి పద్ధతిలో సబ్సిడీ మొత్తాన్ని జమవుతున్నట్లు ఆయన మైక్ ద్వారా ఆచంట పరిసర ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు.

నేడు కోపల్లెలో యుటిఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలు

ప్రజాశక్తి - కాళ్ల

కోపల్లె హైస్కూల్లో యుటిఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలను జయప్రదం చేయాలని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి, మండల ఇన్‌ఛార్జి రామకృష్ణంరాజు, మండల అధ్యక్షులు బి.రాజమౌళి కోటేశ్వరస్వామి, ప్రధాన కార్యదర్శి ఎం.శంకర్రావు శనివారం తెలిపారు. ఆదివారం కోపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి స్వర్ణోత్సవ మహాసభలు నిర్వహిస్తున్నామన్నారు. ఎస్ఎస్‌సి 2024లో మండలంలోని ప్రతి ఉన్నత పాఠశాల నుంచి స్కూల్ ఫస్ట్ పొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం, మండల, జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పొందిన గురువులకు సన్మానం, స్వర్ణోత్సవ సంబరాల్లో భాగంగా నిర్వహించిన ఆటల పోటీల్లో గెలుపొందిన ఉపాధ్యాయులకు బహుమతుల ప్రదానం జరుగుతుందని వివరించారు. ఈ మహాసభకు ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు (ఐవి), రాష్ట్ర కోశాధికారి బొర్రా గోపీమూర్తి, జిల్లా అధ్యక్షులు వి.ఎస్.విజయరామరాజు, ప్రధాన కార్యదర్శి ఎవివి.రామభద్రం కోశాధికారి సిహెచ్.పట్టాభిరామయ్య ముఖ్యఅతిథులుగా పాల్గొంటారు. ఈ మహాసభలో యుటిఎఫ్ సీనియర్ నాయకులకు సత్కారం, నూతన కౌన్సిల్ ఎన్నికలు జరుగుతాయని తెలిపారు.

6లోగా పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలి

నరసాపురం:తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రులు నవంబర్ ఆరో తేదీలోగా ఓటర్ల నమోదును చేసుకోవాలని తహశీల్దార్ బి.రాజరాజేశ్వరి తెలిపారు. అక్టోబర్ 2021 నాటికి పట్టభద్రులైన వారంతా అర్హులని పేర్కొన్నారు. ఆన్‌లైన్ ఓటు నమోదుకు ఫారం-18తోపాటు అటెస్టేషన్ చేయించిన డిగ్రీ ప్రొవిజనల్ సర్టిఫికెట్, ఆధార్ కార్డు నకలు, ఓటరు కార్డు నకలు, ఫొటో, మొబైల్ నంబరును నిర్దేశిత కేంద్రాల్లో అందజేయాలని పేర్కొన్నారు. ఓటర్ల నమోదుకు ఫారమ్ 18లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పట్టభద్రుల ఓటర్ల జాబితాలో గతంలో నమోదై ఉన్నప్పటికీ అర్హులందరూ కొత్తగా నమోదు చేసుకోవాలన్నారు. డిగ్రీ ఎక్కడ పూర్తి చేసినప్పటికీ వారి సాధారణ నివాసం ఎక్కడ ఉంటే అక్కడే ఓటు నమోదు చేసుకోవచ్చున్నారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యాన డ్రాయింగ్, వక్తృత్వ పోటీలు

పాలకొల్లు రూరల్:ఉల్లంపర్రు డాక్టర్ సవిత మాంటిస్సోరీస్ ప్రాంగణంలో డ్రాయింగ్, వక్తృత్వ పోటీలు శనివారం నిర్వహించారు. ఈ పోటీలను పాలకొల్లు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పోలియో నిర్మూలన, పోలియో నిర్మూలనలో రోటరీ పాత్ర అనే అంశంపై డ్రాయింగ్, వక్తృత్వ పోటీలు పాలకొల్లులోని 15 స్కూళ్ల నుంచి వచ్చిన విద్యార్థులకు నిర్వహించారు. ఈ పోటీల్లో 145 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి రోటరీ అసిస్టెంట్ గవర్నర్ ముత్యాల శ్రీనివాస్, జిల్లా పోలియో రీజినల్ ఛైర్ మద్దాల వాసు ముఖ్యఅతిథులుగా విచ్చేసి విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

ఇఒ తీరును నిరసిస్తూ ఆందోళన

ప్రజాశక్తి - నరసాపురం

పట్టణంలోని కపిల మల్లేశ్వర స్వామి ఆలయం వద్ద ఇఓ తీరును వ్యతిరేకిస్తూ శుక్రవారం రాత్రి యాత్రికులు, విశ్వహిందూ పరిషత్, భజరంగ్ దళ్ సభ్యులు ఆందోళనకు దిగడంతో మూడు గంటల పాటు ఉద్రిక్తత నెలకొంది. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ ఏడాది కార్తీకమాసంలో దర్శనానికి టిక్కెట్లు పెట్టాలని ఇఒ కొండవీటి రామచంద్ర రావు ప్రతిపాదించారు. దీంతో యాత్రికులు, వారికి మద్దతుగా విహెచ్‌పి, బజరంగ్దళ్ సభ్యులు ఇఒతో వాగ్వాదానికి దిగారు.

అన్నసమారాధన గొప్పది

కాళ్ల:అన్ని దానాల్లోకి అన్నదానం చాలా గొప్పదని దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్ట్ అధినేత దాట్ల వెంకట రామరాజు అన్నారు. దేవీ నవరాత్రుల సందర్భంగా కాళ్లకూరులో అఖండ అన్న సమారాధన శనివారం నిర్వహించారు. పేరంటాళ్లమ్మ చెరువు వద్ద నిర్వహించే అన్న సమారాధనకు దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్ట్ అధినేత దాట్ల వెంకట రామరాజు ముందుకొచ్చి నాలుగు బస్తాల బియ్యం అందజేశారు. వెయ్యి లీటర్ల ఆర్‌ఒ వాటర్ అందజేశారు. ట్రస్ట్ అధినేత దాట్ల వెంకట రామరాజు మాట్లాడుతూ పది మంది ఆకలి తీర్చడం నిజంగా ఒక అదృష్టమన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు నాగరాజు, భోగేష్, యాత్రికులు పాల్గొన్నారు.

డిఎన్‌ఆర్‌లో గుర్తు తెలీని మృతదేహం

ప్రజాశక్తి - పాలకొల్లు

నేరాలు - ఘోరాలు

పాలకొల్లు డిఎన్‌ఆర్ మహిళా కళాశాల ప్రాంగణంలో శనివారం గుర్తు తెలియని మృతదేహన్ని కనుగొన్నారు. కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ పి.శోభారాణి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో, హుటాహుటీన పోలీసులు వచ్చి దర్యాప్తు చేపట్టారు. మృతదేహం దాదాపుగా కుళ్లిపోయి ఉంది. గుర్తుపట్టడానికి వీల్లేకుండా ఉంది. పట్టణ ఎస్ఐ పృథ్వి, ఎస్ఐ బాదం శ్రీనివాస్ నేతృత్వంలో డాక్టర్ పియూష వర్మ, విఆర్‌ఒ సుబ్బారావుతో కలిసి మృతదేహన్ని పరిశీలించారు. మృతుడు పురుషుడు, వయసు సుమారు 70 ఏళ్లు ఉండొచ్చని భావిస్తున్నారు. దర్యాప్తు అనంతరం పూర్తి విషయాలు వెల్లడిస్తామని ఎస్ఐ తెలిపారు.

గుండెపోటుతో ఆర్‌టిసి కండక్టర్ మృతి

పెనుగొండ:విధి నిర్వహణలో ఆర్‌టిసి కండక్టర్ మతి చెందిన సంఘటన మండలం వడలి గ్రామంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. తణుకు పట్టణానికి చెందిన ఎస్‌కె.నారాయణ (59) ఆర్‌టిసి కండక్టర్‌గా పనిచేస్తున్నారు. కొవ్వూరు డిపో నుంచి భీమవరం నుండి రాజమండ్రి వెళ్తుండగా వడలి గ్రామంలోని శ్రీనివాసా సర్వీసింగ్ సెంటర్ వద్దకు వచ్చేసరికి నారాయణకు గుండె నొప్పి రావడంతో ఒక్కసారిగా కుప్పకూలిపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో బస్సు డ్రైవర్ కొవ్వూరు డిపో మేనేజర్‌కు సమాచారం అందించారు. నారాయణకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆయన స్వగ్రామం తణుకు అయినా కొవ్వూరులో ఉద్యోగరీత్యా నివాసం ఉంటున్నారు. ఆయన మృతికి కొవ్వూరు డిపో మేనేజర్ వివిఎన్.కుమార్, సిబ్బంది సంతాపం తెలిపి, కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ద్విచక్ర వాహనం చోరీ : కేసు నమోదు

మొగల్తూరు:తన ద్విచక్రవాహనం చోరీ జరిగిందని బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుపై శనివారం కేసు నమోదు చేశామని ఎఎస్ఐ యు.రాజేంద్ర తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మొగల్తూరు పంచాయతీ పరిధి కుక్కలవారితోటకు చెందిన పాలా శ్రీనివాస్ ఈ ఏడాది జనవరి 25న గ్రామంలోని వరి చేను వద్దకు ద్విచక్రవాహనంపై వెళ్లాడు. వాహనం రహదారిపై నిలిపి చేను వద్దకు వెళ్లి తిరిగి వచ్చేసరికి బండి అపహరణకు గురైంది. దీనిపై శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎఎస్ఐ తెలిపారు.

భూ సమస్యల పరిష్కారానికి చర్యలు

ప్రజాశక్తి - ఆచంట

భూముల రీసర్వేపై గ్రామ సభలో వచ్చిన ప్రతి సమస్యనూ క్షుణ్ణంగా పరిశీలించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ ఎం.సోమేశ్వరరావు అన్నారు. శనివారం కొడమంచిలి రైతు సంఘం కార్యాలయంలో భూ సమస్యలపై గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా కొడమంచిలిలో పంట భూముల రీ సర్వే నంబర్లు తప్పు పడ్డాయని, వాటిని సరిచేయాలని తహశీల్దార్ వద్ద పలువురు రైతులు విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ రైతులు ఎవరికైనా విస్తీర్ణంలో వ్యత్యాసం ఉన్నా, జాయింట్ ఎల్‌పిఎం సబ్ డివిజన్ చేయాల్సి ఉన్నా వారంతా తప్పకుండా ఈ నెల 30వలోపు తహశీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పలు భూ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ రాజ్యలక్ష్మి, ఆర్‌ఐ జయలలిత, విఆర్‌ఒ రాజు, సిహెచ్ శ్రీహరి, నాయకులు పాల్గొన్నారు.



ఆచంట : మాట్లాడుతున్న తహశీల్దార్ సోమేశ్వరరావు

పాలకోడేరు : గొల్లలకోడేరు సచివాలయం వద్ద శనివారం రీ సర్వే గ్రామసభ నిర్వహించారు. ఈ సభకు సర్పంచి కుక్కల లక్ష్మి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని రైతులు, భూస్వాములు భూ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. వివిధ భూ సమస్యలపై 13 వినతులను రైతులు అధికారులకు అందజేశారు. రీసర్వేపై ఉన్న అపోహలు, రీసర్వే నిర్వహణ, భూ సమస్యలకు పరిష్కారం మార్గాలపై రీసర్వే డిప్యూటీ తహశీల్దార్ సూర్యనారాయణ రాజు, మండల సర్వేయర్ సిహెచ్ శ్రీనివాస్ రావు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ ఎన్‌బి.విజయలక్ష్మి మాట్లాడుతూ రీసర్వే గ్రామ సభలను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ అధికారి కె.రాఘవమూర్తి రాజు, సచివాలయ కార్యదర్శి నాగేంద్ర, గ్రామ రెవెన్యూ అధికారి సందీప్ కుమార్‌రాజు పాల్గొన్నారు.

ఎస్ఎన్ఎంలో ప్రాంగణ ఎంపికలు

190 మందికి ఉద్యోగావకాశాలు

ప్రజాశక్తి - పాలకొల్లు

అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ స్వయం ప్రతిపత్తి డిగ్రీ కళాశాలలో శనివారం ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. వివిధ బహుళ జాతి సంస్థలకు చెందిన 18 కంపెనీలు ప్రాంగణ ఎంపికల్లో విద్యార్థుల ప్రతిభ, నైపుణ్యాన్ని పరీక్షించి ఎంపిక చేశారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ టి.రాజరాజేశ్వరి అధ్యక్షత వహించగా కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షులు, కార్యదర్శులు డాక్టర్ ఎస్‌వి.రంగారావు, మాజీ ప్రధానాచార్యులు కారుమూరి రామలింగేశ్వరరావు, ప్రముఖ వ్యాపారవేత్త, కళాశాల ఉప ప్రధానాచార్యులు టి.కృష్ణ పాల్గొన్నారు. కళాశాల ప్రిన్సిపల్ అభ్యర్థులను ఉద్దేశించి మాట్లాడారు. మొత్తం 305 మంది విద్యార్థులు పాల్గొనగా వారిలో 195 మంది ఉద్యోగాలు పొందినట్లు చెప్పారు.

రేషన్ డీలర్లు స్టాక్ బోర్డులు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - ఆచంట

రేషన్ డీలర్లు విధిగా దుకాణాల వద్ద స్టాకు రిజిస్టర్లు, బోర్డులు ఏర్పాటు చేయాలని తహశీల్దార్ ఎం.సోమేశ్వరరావు అన్నారు. శనివారం తహశీల్దార్ కార్యాలయంలో రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ సోమేశ్వరరావు మాట్లాడుతూ డీలర్లు రేషన్ దుకాణాల వద్ద స్టాక్ బోర్డులు విధిగా ఏర్పాటు చేయాలన్నారు. సకాలంలో డీడీలు చెల్లించి కార్డుదారులకు సరుకులు అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు. నవంబర్‌లో వినియోగదారులకు పంచదార, కందిపప్పు కూడా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో సిఎస్‌డిటి దేవి, కార్యాలయ సిబ్బంది, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

వైఎస్ఆర్ కాలనీలో కమ్యూనిటీ హాల్ నిర్మించాలి

ప్రజాశక్తి - భీమవరం

పట్టణంలోని వైఎస్ఆర్ కాలనీలో వెంటనే కమ్యూనిటీ హాల్ నిర్మించాలని టౌన్‌షిప్ మూడో శాఖ డిమాండ్ చేసింది. స్థానిక టౌన్‌షిప్‌లో సిపిఎం మూడో శాఖ మహాసభ తణుకు ఆదిలక్ష్మి అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి బి.వాసుదేవరావు మాట్లాడుతూ వైఎస్ఆర్ కాలనీ ఏర్పడి 15 ఏళ్లు దాటిందన్నారు. కమ్యూనిటీ హాల్ గురించి 30 సెంట్లు అప్పటి ప్రభుత్వం కేటాయించిందని, ఇంతవరకూ కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేయలేదని తెలిపారు. ఈ విషయంపై అనేకసార్లు అనేక మందికి ఫిర్యాదులు అందించినప్పటికీ సమస్య పరిష్కారానికి నోచుకోలేదన్నారు. సిపిఎం పట్టణ నాయకులు ఎం.వైకుంఠరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మహాసభలో సిపిఎం శాఖ కార్యదర్శి కె.శ్రీనివాసులు, కె.దుర్గ, తణుకు ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

ప్రజారక్షణలోనే పోలీసులు : సిఐ

ప్రజాశక్తి - భీమవరం టౌన్

పోలీసులు విధి నిర్వహణలో ప్రాణాలు సైతం లెక్కజేయరని, రేయింబవళ్లు ప్రజా రక్షణలోనే ఉంటారని ఒకటో పట్టణ సిఐ నాగరాజు అన్నారు. శ్రీవిజ్ఞాన వేదిక, భీమవరం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో శనివారం సిఎస్ఎన్ కళాశాలలో పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ నాగరాజు మాట్లాడుతూ అరాచకాలను అరికట్టడంలో కొన్ని సమస్యలను కూడా పోలీసులు ఎదుర్కొంటారని, ఎవరిపైనా పోలీసులకు కక్ష ఉండదని అన్నారు. యుద్ధంలో అశువులు బాసిన వారిని స్మరించుకుంటూ పోలీసుల అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ పోలీసు శాఖ అధికారుల ప్రకారం వారి అంశంపై రెండు కళాశాలలో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించామని, గెలుపొందిన వారికి ముగింపు రోజున బహుమతులు, ప్రశంసా పత్రాలను అందిస్తామని తెలిపారు. అనంతరం ప్రతిజ్ఞ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల కోశాధికారి వడుప గోపి, అల్లు రామకృష్ణ, అల్లు వనజాక్షి, జి గణపతి, గెడ్డం భాస్కర రావు పాల్గొన్నారు.



ఫుడ్‌స్టాల్‌లో విద్యార్థులు

సన్‌షైన్‌లో ఫుడ్ ఫెస్టివల్

ప్రజాశక్తి - నరసాపురం

పట్టణంలోని సన్‌షైన్ స్కూల్లో శనివారం నిర్వహించిన ఫుడ్ ఫెస్టివల్ - 2024 కార్యక్రమం పలువురిని ఆకట్టుకుంది. విద్యార్థులు సౌత్, నార్త్, తెలుగు, వెజ్, నాన్ వెజ్ వివిధ రకాల వంటకాలు తయారుచేసి స్టాల్ ఏర్పాటు చేశారు. ఈ స్టాల్స్ విక్రయాలు చేశారు. దీంతో సందడి వాతావరణం నెలకొంది. విద్యార్థులు వ్యాపారస్తులుగా మారి అలరించారు. స్కూల్ ప్రాంగణం అంతా వంటకాలతో ఘుమ ఘుమ లాడాయి. ఈ సందర్భంగా స్కూల్ కరస్పాండెంట్ ఎం.జయప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్లో వాపారవేత్తలుగా రాణించడానికి ఉపయోగపడే విధంగా ఇలాంటి కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో ఐసిఐసిఐ బ్యాంక్ మేనేజర్ ప్రదీప్‌కుమార్, పాఠశాల డైరెక్టర్ ఎం.సాధన్లియో, ప్రిన్సిపల్ మేరిన్ జాకబ్, నిఖిల, పెద్దిరాజు పాల్గొన్నారు.

దావా సమను ప్రకటన

మహారాజశ్రీ పాలకొల్లు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి మరియు జుడిషియల్ ఫస్టు క్లాస్ మేజిస్ట్రేట్ వారి కోర్టులో

O.S.No.116/2022

బిట్వీన్:
రేపాక విజయ శాంతి ...వాది
VS
గుండాబత్తుల రాజు ...ప్రతివాది

టు: గుండాబత్తుల రాజు, తండ్రి: రామారావు, డో.నెం.6ఎ-10-21, గుత్తుల వారి పేట, పాలకొల్లు, పాలకొల్లు మండలం, P.P.J.C.J.C. P.J.F.R.C.

పై నెంబరు దావాలో ప్రతివాది హాజరు నిమిత్తం శ్రీ కోర్టు వారు పై నెంబరు దావాను ది.12-11-2024 సంగరం తేదీకి వాయిదా వేసినారు. కాబట్టి ప్రతివాది పై నెంబరు దావాలో **ది.12-11-2024 సంగరం తేదీన ఉదయం గంగ10:30 నిగలకు స్వయంగా గాని, న్యాయవాది ద్వారా గాని శ్రీ కోర్టు వారు ఎదుట హాజరు కావలెను.** అట్లు హాజరు కానిచో ప్రతివాది పరోక్షమందు పై నెంబరు దావాను శ్రీ కోర్టు వారు తీర్మానించెదరని తెలియజేయమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

కోడూరి వెంకటేశ్వరరావు
అడ్వకేట్, పాలకొల్లు.
పాలకొల్లు,
25-10-24. సెల్:9441750937

బాధ్యులపై చర్యలు తీసుకుంటాం

డిసిహెచ్‌సి సూర్యనారాయణ - ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి వ్యవహారాలపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని జిల్లా ఆసుపత్రుల సేవల సమన్వయ అధికారి పి.సూర్యనారాయణ తెలిపారు. శనివారం ప్రజాశక్తిలో పత్రికలో 'ప్రసవానికి పైసలివ్వల్సిందే' శీర్షికన ప్రచురితమైన కథనానికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ స్పందించింది. ఈ అంశంపై జిల్లా ఆసుపత్రుల సేవల సమన్వయ అధికారి సూర్యనారాయణ ఆస్పత్రి అధికారులను ఆరా తీశారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ ఆర్.సుప్రియను ఈ మొత్తం వ్యవహారంపై తనకు నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. దీంతో ఆమె ప్రాథమికంగా దర్యాప్తు చేసి నివేదికను రాతపూర్వకంగా అధికారులకు అందజేశారు. కొంతకాలంగా ఆసుపత్రుల్లో డెలివరీ కేసులో బాలింత బంధువుల నుంచి ఓ ఉద్యోగి డబ్బులు వసూలు చేస్తున్న వ్యవహారంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. అలాగే ఆస్పత్రిలో దీర్ఘకాలంగా పనిచేస్తూ కౌన్సెలింగ్ చేస్తున్న మరో ఉద్యోగి తీరును కూడా ప్రజాశక్తి బయటపెట్టింది. కౌన్సెలింగ్ పేరుతో సదరు ఉద్యోగి గర్భిణులను తన రూమ్ వద్ద గంటల తరబడి కూర్చోబెట్టడం కూడా విమర్శలకు తావిస్తోంది. ఆ ఉద్యోగి తీరుపై గర్భిణులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై స్పందించిన డిసిహెచ్‌సి సూర్యనారాయణ ప్రజాశక్తితో మాట్లాడుతూ ఆసుపత్రి వ్యవహారాలపై పూర్తిస్థాయిలో విచారణ చేస్తామన్నారు. ఇప్పటికే ఈ అంశంపై దర్యాప్తు చేసి తనకు నివేదిక ఇవ్వాల్సిందిగా ఆదేశించినట్లు తెలిపారు. ఇందులో తప్పు ఉన్నట్టు తెలిస్తే శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని వివరించారు.

'టిడిపి సభ్యత్వం కార్యకర్తలకు వరం'

ప్రజాశక్తి - భీమవరం టౌన్

టిడిపి సభ్యత్వం 100 రూపాయలతో తీసుకున్న వారు ప్రమాదవశాత్తూ మరణిస్తే రూ.5 లక్షల నష్టపరిహారం, మరణించిన రోజే రూ.10 వేలు మట్టిఖర్చులు కింద చెల్లిస్తామని టిడిపి జిల్లా అధ్యక్షుడు, ఎపిఐఐసి ఛైర్మన్ మంతెన రామరాజు తెలిపారు. పట్టణంలోని 6వ వార్డు బొక్కావారిపాలెంలో టిడిపి సభ్యత్వ నమోదు, పునరుద్ధరణ కార్యక్రమాన్ని మంతెన రామరాజు ప్రారంభించి మాట్లాడారు. లక్ష రూపాయలు చెల్లించిన వారికి శాశ్వత సభ్యత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నూతన విధానాన్ని ప్రవేశపెట్టారని తెలిపారు. టిడిపి నాయకులు, కార్యకర్తలు ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని రికార్డులు స్థాయిలో సభ్యత్వ నమోదు పునరుద్ధరించుకోవాలన్నారు. వీరవాసరం మండలం నేలపోగుల గ్రామం, భీమవరం మండలం దిరుసుమర్రు గ్రామం, భీమవరం పట్టణం బొక్కవారిపాలెంలో సభ్యత్వ సేకరణ కార్యక్రమలలో పాల్గొన్న భీమవరం నియోజకవర్గ టిడిపి పరిశీలకుడుకు రాష్ట్ర కార్యదర్శి దాసరి ఆంజనేయులు మాట్లాడారు. కార్యక్రమాల్లో పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ఇందుకూరి సుబ్రహ్మణ్యరాజు, గూడూరి సుబ్బారావు, వీరవాసరం, భీమవరం మండలాల అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.

నరసాపురం:ప్రజలందరూ టిడిపిలో చేరి రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములు కావాలని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు అన్నారు. శనివారం మండలంలోని గొంది, చిట్టవరం, పట్టణంలోని 1, 2 వార్డుల్లో టిడిపి సభ్యత్వ నమోదు పునరుద్ధరణ కార్యక్రమాన్ని రామరాజు ప్రారంభించి మాట్లాడారు. పార్టీ సభ్యత్వం తీసుకుని చనిపోయిన కార్యకర్తలకు ఐదు లక్షల ఇన్సూరెన్స్‌తో పాటు రూ.10 వేల మట్టి ఖర్చులు అందిస్తారన్నారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు జక్కం శ్రీమన్నారాయణ, పట్టణ కార్యదర్శి కొల్లు పెద్దిరాజు, మండల అధ్యక్షుడు వాతాడి ఉమా, శంకు భాస్కర్ నాయుడు పాల్గొన్నారు.

ఆచంట : మంత్రి నారా లోకేష్ టిడిపి కార్యకర్తల సభ్యత్వంతోపాటు రూ.ఐదు లక్షల ఇన్సూరెన్స్ సౌకర్యాన్ని కల్పిస్తోందని టిడిపి మండల అధ్యక్షులు కేతా మీరయ్య అన్నారు. శనివారం ఆచంటలో టిడిపి సభ్యత్వాల నమోదు కార్యక్రమం చురుగ్గా సాగుతోంది. గతంలో రూ.రెండు లక్షల ఇన్సూరెన్స్ సౌకర్యం ఉండేదని, ఈ సౌకర్యాన్ని రూ.5 లక్షల వరకూ పెంచారని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు గొడపర్తి శ్రీరాములు, బీరా నరసింహమూర్తి, తమ్మినీడి ప్రసాద్ పాల్గొన్నారు.

పాలకొల్లు : టిడిపి సభ్యత్వం తీసుకోవడం కార్యకర్తలకు వరమని మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్ చెప్పారు. పట్టణంలోని 1, 21వ వార్డుల్లో వచ్చే రెండు సంవత్సరాల పార్టీ సభ్యత్వాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి పెచ్చెట్టి బాబు, మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ కర్నేన రోజా రమణి, జిల్లా మైనార్టీ సెల్ మాజీ అధ్యక్షులు మహమ్మద్ జానీ, పట్టణ టిడిపి అధ్యక్షులు జివి పాల్గొన్నారు.

నరసాపురం : టిడిపి సభ్యత్వ నమోదులో భాగంగా మాజీ ఎంఎల్‌ఎ బండారు మాధవనాయుడు టిడిపి సభ్యత్వాన్ని పునరుద్ధరించుకున్నారు. ఈ సందర్భంగా మాధవ నాయుడు మాట్లాడుతూ కార్యకర్తలు, వారి కుటుంబ సభ్యుల సంక్షేమం చూసే ఏకైక రాజకీయ పార్టీ టిడిపి అన్నారు. కార్యకర్తలకు అండగా ఉండేందుకు ఈ సభ్యత్వం దోహద పడుతుందన్నారు.

తణుకు : టిడిపి ప్రభుత్వంలో కార్యకర్తలకు అండగా నిలబడి వారి సంక్షేమానికి సభ్యత్వ నమోదుకు వేదికగా తీసుకుని టిడిపి ముందుకెళ్తోందని ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఎంఎల్‌ఎ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఎంఎల్‌ఎ శాశ్వత సభ్యత్వం నిమిత్తం రూ.లక్ష చెల్లించి సభ్యత్వం తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గతంలో ఉన్న దానికన్నా భిన్నంగా ఈ రోజు రూ.100 చెల్లించి సభ్యత్వం తీసుకుంటే రూ.5 లక్షల బీమా సౌకర్యం కల్పించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మొగల్తూరు : లక్ష్యం మేరకు టిడిపి సభ్యత్వం పూర్తి చేయాలని పార్టీ నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరు రామరాజు కార్యకర్తలకు సూచించారు. మొగల్తూరు పంచాయతీ పరిధి కన్నాయిగూడెంలో టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

కవితోత్సవంలో గురుశిష్యులకు ప్రపంచ స్థాయి రికార్డులు

ప్రజాశక్తి - పాలకొల్లు

శ్రీశ్రీ కళావేదిక వారు నిర్వహించిన ప్రపంచ కవితోత్సవంలో పోడూరు మండలం గుమ్ములూరు ప్రాథమిక పాఠశాలకు చెందిన ప్రధానోపాధ్యాయుడు, ఇద్దరు విద్యార్థినులు ప్రతిభను కనబర్చి 4 ప్రపంచ రికార్డుల్లో పేరు నమోదు చేసుకున్నారు. ఈ నెల 19, 20 తేదీల్లో తాడేపల్లిగూడెంలో 24 గంటల 24 నిమిషాల 24 సెకండ్ల పాటు నాన్‌స్టాప్ ప్రపంచ సాహితీ కళాజాతరలో పోడూరు ఎంపిపి పాఠశాల హెచ్ఎం, కవి, రచయిత కొల్లాబత్తుల సూర్యకుమార్ తెలుగుభాష ఔన్నత్యంపై కవితను ఆలపించగా, విద్యార్థినులు రాపాక అమృత వర్షిణి, గుడాల టాబు శ్రీలక్ష్మి దేశభక్తి గీతానికి నృత్యాన్ని ప్రదర్శించి ఈ రికార్డులు సాధించారు. ఈ గురుశిష్యులను మండల విద్యా శాఖాధికారులు జి.విజయకుమార్, జివి.సూర్యనారాయణ, కాంప్లెక్స్ ఛైర్మన్ కె.బేబీ విజయలక్ష్మి, సిఆర్‌పి మైలే శాంత కుమారి, ఉపాధ్యాయుడు వీరవల్లి బాలాజీ, ఎస్‌యసి ఛైర్మన్ బొంతు వీరాంజనేయులు, ఎటిఎఫ్ అధ్యక్ష కార్యదర్శులు దాసరి క్షేమమూర్తి, కేతా నాగరాజు తదితరులు అభినందించారు.

పాస్‌పోర్టు పోయినది

తూర్పు గోదావరి జిల్లా, కాకినాడ, సంజయ్ నగర్, డో.నెం.17-06-24కు చెందిన **తాటిపాక అరుణ, భర్త: తాటిపాక ఇస్సాకు** అను నాయొక్క ఒరిజినల్ పాస్‌పోర్టు పోయినది. **పాస్‌పోర్టు నెం. X4481885.** అనగా నాకు వివాహం అయ్యి నాభర్త గారు ఊరు అయిన సంజయ్ నగర్, కాకినాడలో ఉండే వారము. నాకు ముగ్గురు పిల్లలు. నాకు నా భర్తతో గొడవలు వచ్చి ది.13-08-2024వ తేదీ నుండి నా మేనత్త అయిన కాళ్ళ మండలం, బొండాడపేట కాపురస్తులు చిత్తలూరి అమ్మాజి గారి ఇంటి వద్ద ఉంటున్నాను. నేను దుబాయ్ వెళ్లామని **X4481885** నెంబరు గల పాస్‌పోర్టు చేయించుకొని మా మేనత్త ఇంట్లో పెట్టియున్నాను. ది.03-10-2024వ తేదీన ఇంట్లో ఎవ్వరము లేము ది.09-10-2024వ తేదీన వచ్చి ఇల్లు చూసుకొనేసరికి ఇంట్లో ఉన్న బంగార వస్తువులు దానితోపాటు నాయొక్క **X4481885 నెంబరు గల ఒరిజినల్ పాస్‌పోర్టు దొంగిలించబడింది.** మేము కాళ్ళ పోలీసు స్టేషనులో రిపోర్టు ఇవ్వగా క్రైం నెం.229/2024 కేసు నమోదు చేసాము. కావున నేను వేరే పాస్‌పోర్టు చేయించుకొనుటకు ఎండార్స్‌మెంటు సర్టిఫికెట్ ఇవ్వవలసిందిగా కోరుచున్నాను.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) కోర్టు-కమ్-ఫస్ట్ క్లాస్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ వారి కోర్టులో, నరసాపురం

O.S. No. 341/2022

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచ్, దాని బ్రాంచ్ మేనేజర్ -వాది

మరియు

D-1) పట్టిసపు సీతామహాలక్ష్మి -ప్రతివాదులు

ప్రతివాదులకు సమన్లు

D-1: పట్టిసపు సీతామహాలక్ష్మి, W/o. నాగరాజు, డోర్ నెం. 4-24, 4వ బ్లాక్, గగ్గిపర్రు, H/o అడవిపాలెం, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా, 534258.

వాదికి చెల్లించాల్సిన రుణ మొత్తాన్ని వడ్డీతో సహా వసూలు చేసేందుకు పై దావా మీ పై దాఖలు చేయబడింది. దావా దాఖలు చేసిన తరువాత కోర్టు ద్వారా మరియు రిజిష్టర్ పోస్ట్ ద్వారా మీకు సమన్లు పంపబడ్డాయి, అవి తిరిగివచ్చాయి. అప్పుడు గౌరవనీయ న్యాయస్థానం వాది దాఖలు చేసిన దావా గురించి సమన్లు జారీ చేయబడిందని మీకు తెలియజేయడానికి ఈ పేపర్‌లో ప్రచురించాలని ఆదేశాలు జారీ చేసింది. కాబట్టి మీరు వ్యక్తిగతంగా, లేదా మీ న్యాయవాది ద్వారా **ది. 28-10-2024 సం॥రం తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** కోర్టుకు హాజరై మీపై దాఖలైనా దావాలో మీ వివరణ ఇవ్వవలసి ఉంటుంది. మీరు పైన పేర్కొన విచారణ తేదిలో కోర్టుకు హాజరు కావడంలో విఫలమైతే, పై దావాపై మీకు ఆసక్తిలేదని భావించి, విచారణ జరిపి తీర్పు వెలువరిస్తారు.

మోచర్ల సత్యకృష్ణ, న్యాయవాది
3-4-10, జంపావారి వీధి
నరసాపురం నరసాపురం-534275, ప॥గో॥జిల్లా
ది. 26-10-2024 సెల్: 98662 59514

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) కోర్టు-కమ్-ఫస్ట్ క్లాస్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ వారి కోర్టులో, నరసాపురం

O.S. No. 29/2024

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచ్, దాని బ్రాంచ్ మేనేజర్ -వాది

మరియు

D-1) పజ్జూరి శ్రీనివాసరావు
D-2) పజ్జూరి వీరమణి -ప్రతివాదులు

ప్రతివాదులకు సమన్లు

D-1: పజ్జూరి శ్రీనివాసరావు, S/o. మల్లేశ్వరరావు, డోర్ నెం. 3-109, 4వ బ్లాక్, గగ్గిపర్రు, H/o అడవిపాలెం, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా, 534258.

D-2: పజ్జూరి వీరమణి, W/o. శ్రీనివాసరావు, డోర్ నెం. 3-109,4వ బ్లాక్, గగ్గిపర్రు, H/o అడవిపాలెం, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా, 534258.

వాదికి చెల్లించాల్సిన రుణ మొత్తాన్ని వడ్డీతో సహా వసూలు చేసేందుకు పై దావా మీ పై దాఖలు చేయబడింది. దావా దాఖలు చేసిన తరువాత కోర్టు ద్వారా మరియు రిజిష్టర్ పోస్ట్ ద్వారా మీకు సమన్లు పంపబడ్డాయి, అవి తిరిగివచ్చాయి. అప్పుడు గౌరవనీయ న్యాయస్థానం వాది దాఖలు చేసిన దావా గురించి సమన్లు జారీ చేయబడిందని మీకు తెలియజేయడానికి ఈ పేపర్‌లో ప్రచురించాలని ఆదేశాలు జారీ చేసింది. కాబట్టి మీరు వ్యక్తిగతంగా, లేదా మీ న్యాయవాది ద్వారా **ది. 29-10-2024 సం॥రం తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** కోర్టుకు హాజరై మీపై దాఖలైనా దావాలో మీ వివరణ ఇవ్వవలసి ఉంటుంది. మీరు పైన పేర్కొన విచారణ తేదిలో కోర్టుకు హాజరు కావడంలో విఫలమైతే, పై దావాపై మీకు ఆసక్తిలేదని భావించి, విచారణ జరిపి తీర్పు వెలువరిస్తారు.

మోచర్ల సత్యకృష్ణ, న్యాయవాది
3-4-10, జంపావారి వీధి
నరసాపురం నరసాపురం-534275, ప॥గో॥జిల్లా
ది. 26-10-2024 సెల్: 98662 59514

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) కోర్టు-కమ్-ఫస్ట్ క్లాస్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ వారి కోర్టులో, నరసాపురం

O.S. No. 345/2022

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచ్, దాని బ్రాంచ్ మేనేజర్ -వాది

మరియు

D-1) పితాని దుర్గారావు
D-2) తొంటూ జ్యోతిలక్ష్మి -ప్రతివాదులు

ప్రతివాదులకు సమన్లు

D-1: పితాని దుర్గారావు, S/o. పెదకనకం, డోర్ నెం. 4-15, 4వ బ్లాక్, గగ్గిపర్రు, H/o అడవిపాలెం, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా, 534258.

D-2: తొంటా జ్యోతిలక్ష్మి, W/o. శ్రీనివారావు, డోర్ నెం. 25-11-14/1, 14వ బ్లాక్, రామయ్య హాలు వీధి, పాలకొల్లు, ప॥గో॥జిల్లా, 534260.

వాదికి చెల్లించాల్సిన రుణ మొత్తాన్ని వడ్డీతో సహా వసూలు చేసేందుకు పై దావా మీ పై దాఖలు చేయబడింది. దావా దాఖలు చేసిన తరువాత కోర్టు ద్వారా మరియు రిజిష్టర్ పోస్ట్ ద్వారా మీకు సమన్లు పంపబడ్డాయి, అవి తిరిగివచ్చాయి. అప్పుడు గౌరవనీయ న్యాయస్థానం వాది దాఖలు చేసిన దావా గురించి సమన్లు జారీ చేయబడిందని మీకు తెలియజేయడానికి ఈ పేపర్‌లో ప్రచురించాలని ఆదేశాలు జారీ చేసింది. కాబట్టి మీరు వ్యక్తిగతంగా, లేదా మీ న్యాయవాది ద్వారా **ది. 28-10-2024 సం॥రం తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** కోర్టుకు హాజరై మీపై దాఖలైనా దావాలో మీ వివరణ ఇవ్వవలసి ఉంటుంది. మీరు పైన పేర్కొన విచారణ తేదిలో కోర్టుకు హాజరు కావడంలో విఫలమైతే, పై దావాపై మీకు ఆసక్తిలేదని భావించి, విచారణ జరిపి తీర్పు వెలువరిస్తారు.

మోచర్ల సత్యకృష్ణ, న్యాయవాది
3-4-10, జంపావారి వీధి
నరసాపురం నరసాపురం-534275, ప॥గో॥జిల్లా
ది. 26-10-2024 సెల్: 98662 59514

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) కోర్టు-కమ్-ఫస్ట్ క్లాస్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ వారి కోర్టులో, నరసాపురం

O.S. No. 341/2023

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచ్, దాని బ్రాంచ్ మేనేజర్ -వాది

మరియు

D-1) కామన విజయ -ప్రతివాదులు

ప్రతివాదులకు సమన్లు

D-1: కామన విజయ, D/o. పితాని సత్యనారాయణ, డోర్ నెం. 22-7, 4వ బ్లాక్, గగ్గిపర్రు, H/o అడవిపాలెం, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా, 534258.

వాదికి చెల్లించాల్సిన రుణ మొత్తాన్ని వడ్డీతో సహా వసూలు చేసేందుకు పై దావా మీ పై దాఖలు చేయబడింది. దావా దాఖలు చేసిన తరువాత కోర్టు ద్వారా మరియు రిజిష్టర్ పోస్ట్ ద్వారా మీకు సమన్లు పంపబడ్డాయి, అవి తిరిగివచ్చాయి. అప్పుడు గౌరవనీయ న్యాయస్థానం వాది దాఖలు చేసిన దావా గురించి సమన్లు జారీ చేయబడిందని మీకు తెలియజేయడానికి ఈ పేపర్‌లో ప్రచురించాలని ఆదేశాలు జారీ చేసింది. కాబట్టి మీరు వ్యక్తిగతంగా, లేదా మీ న్యాయవాది ద్వారా **ది. 28-10-2024 సం॥రం తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** కోర్టుకు హాజరై మీపై దాఖలైనా దావాలో మీ వివరణ ఇవ్వవలసి ఉంటుంది. మీరు పైన పేర్కొన విచారణ తేదిలో కోర్టుకు హాజరు కావడంలో విఫలమైతే, పై దావాపై మీకు ఆసక్తిలేదని భావించి, విచారణ జరిపి తీర్పు వెలువరిస్తారు.

మోచర్ల సత్యకృష్ణ, న్యాయవాది
3-4-10, జంపావారి వీధి
నరసాపురం నరసాపురం-534275, ప॥గో॥జిల్లా
ది. 26-10-2024 సెల్: 98662 59514

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) కోర్టు-కమ్-ఫస్ట్ క్లాస్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ వారి కోర్టులో, నరసాపురం

O.S. No. 297/2022

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచ్, దాని బ్రాంచ్ మేనేజర్ -వాది

మరియు

D-1) పితాని శ్రీను
D-2) వేముల సూర్యవంశీధర్ -ప్రతివాదులు

ప్రతివాదులకు సమన్లు

D-2: వేముల సూర్యవంశీధర్, S/o. చంద్రశేఖరు, డోర్ నెం. 4-109, 4వ బ్లాక్, గగ్గిపర్రు, H/o అడవిపాలెం, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా, 534258.

వాదికి చెల్లించాల్సిన రుణ మొత్తాన్ని వడ్డీతో సహా వసూలు చేసేందుకు పై దావా మీ పై దాఖలు చేయబడింది. దావా దాఖలు చేసిన తరువాత కోర్టు ద్వారా మరియు రిజిష్టర్ పోస్ట్ ద్వారా మీకు సమన్లు పంపబడ్డాయి, అవి తిరిగివచ్చాయి. అప్పుడు గౌరవనీయ న్యాయస్థానం వాది దాఖలు చేసిన దావా గురించి సమన్లు జారీ చేయబడిందని మీకు తెలియజేయడానికి ఈ పేపర్‌లో ప్రచురించాలని ఆదేశాలు జారీ చేసింది. కాబట్టి మీరు వ్యక్తిగతంగా, లేదా మీ న్యాయవాది ద్వారా **ది. 28-10-2024 సం॥రం తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** కోర్టుకు హాజరై మీపై దాఖలైనా దావాలో మీ వివరణ ఇవ్వవలసి ఉంటుంది. మీరు పైన పేర్కొన విచారణ తేదిలో కోర్టుకు హాజరు కావడంలో విఫలమైతే, పై దావాపై మీకు ఆసక్తిలేదని భావించి, విచారణ జరిపి తీర్పు వెలువరిస్తారు.

మోచర్ల సత్యకృష్ణ, న్యాయవాది
3-4-10, జంపావారి వీధి
నరసాపురం నరసాపురం-534275, ప॥గో॥జిల్లా
ది. 26-10-2024 సెల్: 98662 59514